

మందస తహసిల్దారుగా మిస్క శ్రీకాంత్

విశాలాంధ్ర-మందస : మందస తహసిల్దారుగా మిస్క శ్రీకాంత్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన జి.సిగడాం తహసీల్దారుగా విధులు నిర్వహించి డిప్యూటేషన్ పై మందస తహసిల్దారుగా నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మిస్క. శ్రీకాంత్‌ను మందస తహసిల్దార్ కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముత్యాలమ్మ కోనేరు గట్టు కబ్జాకు యత్నాలు..

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు..కబ్జా స్థలం స్వాధీనం..!

విశాలాంధ్ర -పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డు సమీపంలో ఉన్న ముత్యాలమ్మ కోనేరు(నెహ్రూ పార్క్) గట్టు స్థలంను గురువారం కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కబ్జా విషయమై రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి వెంటనే స్పందించారు. మండల సర్వేయర్ గిరి తో పాటు సచివాలయ సర్వేయర్లతో కబ్జా స్థలాన్ని కొలతలు వేయించి హద్దులు గుర్తించి వాకర్స్ సభ్యులకు అప్పగించారు. ముత్యాలమ్మ కోనేరు సరిహద్దుల్లో కంచే వేయాలని సూచించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జంట పట్టణాల ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించే ఏకైక ప్రాంతం ముత్యాలమ్మ కోనేరు నెహ్రూ పార్క్. దీని అభివృద్ధికి గతంలో మున్సిపల్ పాలకవర్గాలు దృష్టి సారించిన అక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది. నెహ్రూ పార్క్‌ని అభివృద్ధి చేయాలని ఎన్నోసార్లు ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డా.జీవితేశ్వరరావు కోరిన మున్సిపల్ అధికారులు గాని పాలకవర్గం గానీ దృష్టి సారించకపోవడంతో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పార్క్ అభివృద్ధికి సొంత నిధులు వెచ్చించి సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసుకున్నారు. కోనేరు చుట్టూ మొక్కలు నాటి పెంచుతున్నారు. కమిషనర్ నాగేంద్ర కుమార్ కాలంలో పార్క్ చుట్టూ ఫెన్సింగ్ ను సరిహద్దులలో వేయకుండా గట్టుపై వేయడంతో కబ్జాదారుల దృష్టి పశ్చిమ వైపు ఉన్న గట్టుపై పడింది. ముత్యాలమ్మ కోనేరుకు ఆనుకొని ప్రముఖ వ్యాపారవేత్త, దివంగత మాజీ కౌన్సిలర్ పెంట శశిభూషణరావుకు సంబంధించి భూములు ఉన్నాయి. ఆయన మనవడు పెంట మణి గోపాల్ ఆ భూములను కౌలుకు ఇచ్చి పంటలు పండించుకుంటున్నారు. అయితే కౌలు రైతు ద్వారా సుమారు 50 లక్షల విలువగల 1800 చదరపు అడుగుల స్థలంను కబ్జా చేసేందుకు చదువు చేశారు. ముత్యాలమ్మ కోనేరు సరిహద్దులను చెరిపేశారు. దీని మట్టిని తీసుకుని పొలంలో పడేశారు. దీనిని గమనించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పత్రికా విలేకరులకు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి వెంటనే స్పందిస్తూ తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. సంఘటన స్థలానికి తహసిల్దార్ చేరుకుని సర్వేయర్ గిరిని సర్వే చేయించాలని ఆదేశించారు. చెరువు స్థలం కబ్జాకు గురైందని నిర్ధారించుకుని స్వాధీనం చేసుకున్న స్థలమును వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పండిత రాజేంద్ర, కార్యదర్శి దడియాల నరసింహులు, కోశాధికారి లండ నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాము పాత్రో లకు అప్పగించారు. హద్దుల ప్రకారం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని రెవెన్యూ సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో బందారు చిట్టి, శిష్టు వసంత్, ఉప్పాడ అప్పారావు, వాసుదేవరావు, సంతోష్ బెహరా, ప్రకాష్ లు పాల్గొన్నారు.

నవధాన్యాలతో బహుళ ప్రయోజనాలు

విశాలాంధ్ర-సోంపేట : రానున్న ఖరీఫ్ వరిసాగు కోసం రైతన్నలు ముందుగానే పొలాల్లో నవధాన్యాలు చల్లి అటు పంటకు ఇటు రైతుకు బహుళ ప్రయోజనాలు పొందేలా కృషి చేయాలని సేంద్రీయ వ్యవసాయ ప్రతినిధులు కుమారి, తులసయ్య పేర్కొన్నారు. బేసిరామచంద్రాపురం గ్రామంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి నవధాన్యాల సాగుపై రైతులకు, మహిళలకు అవగాహన కల్పించారు. నవధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, ఆకుకూరలు, పచ్చిరొట్ట తదితర అనేక రకాల విత్తనాలతో కూడిన కిట్లును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందువల్ల నేల గుల్లబారి నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. వానపాములు వృద్ధి చెందుతాయని, సేంద్రీయ కర్బనం పెరుగుతుందని పేర్కొన్నారు. నవధాన్యాలు వేసిన 45 రోజుల్లో పశుగ్రాసం కొరకు వినియోగించి వాటి వేర్లును నేలలో కలియ దున్నాలని సూచిచారు. సిబ్బంది ధనలక్ష్మి, శ్రావణి, కృష్ణవేణి, సుజాత, హైమావతి పాల్గొన్నారు.

వార్డు సచివాలయాల పనితీరుపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయాల పనితీరును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్షించారు. సమీక్షలో పలు శాఖల పరిధి అంశాలపై చర్చ జరిపారు. రెవెన్యూ విభాగంలో డిమాండ్-కలెక్షన్-బ్యాలెన్స్ ప్రకారం నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. యూపీఐ కోడ్‌ల ద్వారా వసూళ్లను పెంచాలని, మున్సిపల్ ఆస్తులైన షాపులు, అద్దెలపై కఠినంగా వసూళ్లు జరగాలని ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో సానిటేషన్ కార్మికుల హాజరు నియమితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్రెయిన్ల డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. కమ్యూనిటీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పూర్తిగా ఆపరేషన్‌లోకి తేవాలని, మున్సిపల్ వాహనాల నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ల ప్రగతిపై సమీక్షించారు. జిందాల్ ప్లాంట్‌కు వ్యర్థాల రవాణాపై స్పష్టత కోరారు. టాయిలెట్ల నిర్వహణ, కొత్తగా నిర్మించే టాయిలెట్లపై కార్యాచరణ చేపట్టాలని చెప్పారు. ఇంజనీరింగ్ శాఖ పరిధిలో మంజూరైన గ్రాంట్లు, జనరల్ ఫండ్ పనుల పురోగతిపై సమీక్షించి, పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో నిర్మాణాలు, కూల్చివేతల వ్యర్థాల నిర్వహణపై ఫోకస్ చేయాలని, ప్లానింగ్ సెక్రటరీల జాబ్ చార్ట్‌ను పాటించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విభాగంలోనూ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద రావు, అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్, ఆయా వార్డు సచివాలయాల అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇవి చట్టవిరుద్ధ చర్యలు...

- సిపిఐ యంయల్ లిబరేషన్ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ దీపాంకర్ భట్టాచార్య

- అమరులకు నివాళి

విశాలాంధ్ర -పలాస: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరుగుతున్న నరహంతక చర్యలను, మిలటరీ చర్యలను తక్షణమే నిలిపివేయాలని ఆపరేషన్ కగార్ పేరుతో సిపిఐ యంయల్ కేంద్ర కమిటీ, సిపిఐ మావో యిస్ట్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు, (భస్వరాజ్) మరియు ఇతర కార్యకర్తలను, ఆదివాసి ప్రజలను నారాయణపూర్, బిజాపూర్ జిల్లాలో చట్ట వ్యతిరేకంగా హత్యలు గావించడాన్ని సిపిఐ యం యల్ లిబరేషన్ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ దిపాంకర్ భట్టాచార్య గురువారం ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కేంద్ర మంత్రి అమిత్ షా హోం శాఖ మంత్రి హోదాలో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిజాన్ని అంతమొందిస్తామని, ఆదివాసి ప్రజలను హతమార్చి కార్పొరేట్ లూటీకి పాల్పడుతున్నారని, సైనిక చర్యలకు పాల్పడుతూ ఆదివాసీలను అంతమొందించేందుకు ఫాసిస్టు ప్రభుత్వం పూనుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయాన్ని ప్రేమించే భారతీయులందరు ఈ నరమేధంపై న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు.మావోయిస్టులు ఏక పక్షంగా కాల్పులు విరమణ ప్రకటించారని, వారిపై సైనిక కార్యకలాపాలు నిలిపివేయాలని విజ్ఞప్తి చేసారు.

సిపిఐ యంయల్ లిబరేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ సంతాపం... సిపిఐ యం యల్ లిబరేషన్ శ్రీకాకుళం జిల్లా తరుపున అమరులైన మావోయిస్టు ప్రదాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు (భస్వరాజ్)తో పాటు 25 మంది అమరులైన, అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పిస్తూ, కుటుంబాలుకు సంతాప సానుభూతిని తెలియజేశారు.

రావివలస గ్రామాన్ని త్వరలో సుందరంగా తీర్చిదిద్దుతాం

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హామీ
- భవాని థియేటర్లో వెండి తెరపై గ్రామస్తులతో ముఖాముఖి మాటలు
- గ్రామస్తులు కోరిన కోరికలను తమ సమస్యలను త్వరలోనే తీరుస్తాం
- గ్రామ అభివృద్ధి కోసం 15 కోట్లు నిధులు విడుదల
- గ్రామస్తులను, మీడియా ప్రతినిధులను అనుమతించ లేదంటూ వాగ్వాదం
- పార్టీ కోసం అనుకూలంగా మాట్లాడే వాళ్ళకే లోపలికి అనుమతంటూ విమర్శలు
- నిరాశగా వెనుతిరిగిన పార్టీ శ్రేణులు, గ్రామస్తులు

విశాలాంధ్ర-టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మన ఊరు-మాటా మంతి అనే కార్యక్రమంపై గ్రామాలలో ఉన్న రూపురేఖలు మార్చాలని ఉద్దేశంతో కొత్త విధానంపై రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుంది. అందులో భాగంగా రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు ఉండగా అందులో మొట్టమొదటిసారిగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గ రావివలస గ్రామాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. త్వరలో ఆ గ్రామాన్ని ఒక పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దే విధంగా చేస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని భవాని థియేటర్లో వెండి తెరపై మంగళగిరి కార్యాలయం నుండి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రావివలస గ్రామస్తులతో వెండి తెరపై ముఖాముఖిగా మాట్లాడారు. ఉన్నత అధికారులు ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న వివిధ సమస్యలపై గ్రామస్తులకు నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రావివలస గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఎండల మల్లికార్జున స్వామి దేవాలయం రూపురేఖలు మారుస్తూ త్వరలోనే టూరిజం చేసే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే గ్రామానికి త్రాగునీరు, రహదారిలు, స్మశాన వాటికకు రహదారిలు, ఉపాధి అవకాశాలు, శానిటేషన్, ఇల్లు నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, పారిశ్రమలు వంటి వివిధ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. గ్రామస్తులు తెలియపరచిన సమస్యలపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందిస్తూ వెంటనే ఆ గ్రామానికి 15 కోట్లు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. వెంటనే గ్రామంలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరత్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేరుగా ముఖాముఖిగా గ్రామస్తులతో మాట్లాడి తమ సమస్యలను పరిష్కరించమని కోరిన వెంటనే అధికారులతో మాట్లాడి అక్కడకక్కడే గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీలు ఇవ్వడంతో గ్రామస్తులు పవన్ కళ్యాణ్ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తింపుతో గేటు వద్ద ఉన్న గ్రామస్తులకు అనుమతించలేదు : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నేరుగా ప్రజలతో మాట్లాడాలని ఉద్దేశంతో కొత్త విధానం తీసుకొస్తుంటే వాటిని కొంతమంది అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని స్థానిక గ్రామస్తులు అంటున్నారు. మన ఊరు - మాట మంతి కార్యక్రమానికి స్థానిక గ్రామంలో ముందు రెండు రోజుల నుండి అధికారులు సమావేశం నిర్వహించి కొంతమందికి గుర్తింపు కార్డులను మంజూరు చేసిందిని. అయితే గురువారం కార్యక్రమానికి మాత్రం గుర్తింపు కార్డులు ఉన్నవారికి కూడా అధికారులు పోలీసులు లోపలికి వెళ్ళనివ్వకుండా అడ్డుకుంటూ గేట్లు వేయడంతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. గేటు వద్ద ఉన్న పోలీసులకు గ్రామస్తులు లోపలికి వెళ్ళనివ్వండి అంటూ అడగగా లోపల అంతా స్థలం లేదని, మొత్తం నిండిపోయారని చెప్పారు. దీంతో ప్రభుత్వంకి అతీతంగా ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారని, కానీ గ్రామస్తులు కి బయటపెట్టి బయట వ్యక్తులకు లోపాలకి అనుమతించారని గ్రామస్తులు మండిపడ్డారు. పార్టీ కోసం అనుకూలంగా మాట్లాడే వాళ్ళకే

లోపలికి అనుమతి ఇచ్చారంటూ విమర్శలు చేశారు.

మీడియాకి నో ఎంట్రీ: ప్రభుత్వ కార్యక్రమాలు, వివిధ సంఘటనలు వార్త రూపంలో సమాచారాన్ని ఒక వారధిగా ప్రజలకు నిరంతరం అందజేస్తున్న మీడియాకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మొట్టమొదటిసారిగా మన ఊరు - మాట మంతి నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమానికి ఉన్నత అధికారులు, పోలీసులు నో ఎంట్రీ అని చెప్పడం సరికాదని స్థానిక మీడియా ప్రతినిధులు వాపోయారు. దీన్ని టెక్కలి మీడియా సభ్యులు తీవ్రంగా ఖండించారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పిస్తున్నది ఒక్క మీడియా మాత్రమే అని ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమానికి మీడియాకి అనుమతించకపోవడం ఎంతవరకు సమన్యాయమని ఉన్నత అధికారులకు ప్రశ్నించారు. భవాని థియేటర్ వద్ద మీడియాకు లోపలికి అనుమతి లేదంటూ రెవెన్యూ అధికారులు, పోలీసులు గేట్లు బంద్ చేయడంతో అక్కడనుండి మీడియా సిబ్బంది నిరాకరించారు.

ఏసీబీ వలలో కాశీబుగ్గ తూనికలు, కొలతల అధికారి

విశాలాంధ్ర-పలాస : కాశీబుగ్గ తూనికలు కొలతల అధికారిగా పనిచేస్తున్న వి.శ్రీధర్ వ్యాపారుల నుంచి రూ.లక్షల్లో డబ్బులు వసూళ్లు చేయడమే కాకుండా వారిని ఏళ్ల తరబడి అనుమతి పత్రాలు ఇచ్చేందుకు తిప్పుతున్నారు. దీనిపై విసిగి పోయిన వ్యాపారులు ఏసీబీ అధికారులను ఆశ్రయించి అవినీతి అధికారిని పట్టించారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో పాతపట్నం, నరసన్నపేట నుంచి ఇటు ఇచ్ఛాపురం వరకూ మండలాలు ఉన్నాయి. వేలాది మంది వ్యాపారులు ఇక్కడి కార్యాలయం పరిధిలోకి వస్తారు. వారి వద్ద ఉన్న విద్యుత్ కాటాలకు ప్రతీ ఏటా కొత్తగా సీళ్ల వేసి వ్యాపార లావాదేవీలు చేయాల్సి ఉంది. దీని కోసం ప్రభుత్వం రూ.300 ఒక్కో కాటాకు రుసుం వసూలు చేస్తుంది. దీనికి కాశీబుగ్గ తూనికల కొలతల శాఖ అధికారులు సీళ్ల వేసి వారికి నిరభ్యంతర పత్రాలు ఇవ్వాల్సి ఉంది. అయితే కాశీబుగ్గ తూనికల కొలతల అధికారి శ్రీధర్ మాత్రం ప్రభుత్వం నిర్దేశించిన ధరతో పాటు అదనంగా ఒక్కో కాటాకు రూ.400 డిమాండ్ చేసారు. దీంతో పాటుగా ఆయనకు నచ్చని వారి కాటాల అనుమతి పత్రాలు ఏడాదిన్నరగా తిప్పుతూ వారికి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన సమాధానం ఇవ్వకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వారి పట్ల వ్యవహరించారు. అనేకసార్లు ఆయనను నిలదీసినా ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోవాలని వారి పట్ల చులకనగా చూడడంతో ఆయనపై ఏసీబీ అధికారులకు వ్యాపారులు నేరుగా ఫిర్యాదు చేసారు.కాగా మొత్తం తూకాల సీళ్లన్నీ స్థానికంగా ఉన్న వాటిని రిపేర్లు చేసే సిబ్బంది చూస్తుంటారు. వారి ద్వారా నగదును అదనంగా సేకరించినట్లు ఆయనపై అభియోగాలు ఉన్నాయి. మొత్తం డివిజన్ పరిధిలో 445 మంది వ్యాపారుల వద్ద రూ.1.78 లక్షలు వసూళ్లు చేయగా ఏసీబీ అధికారులు ఆయన శ్రీధర్ కార్యాలయంపై దాడి చేసి నగదు మొత్తం ను పట్టుకున్నారు . ఏసీబీ నిబంధనల ప్రకారం చేయాల్సిన వ్యవహారమంతా చేసి ఆయనతో పాటు బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకొన్నారు. నగదుతో పట్టుబడిన తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీధర్ ను విశాఖపట్నం ఏసీబీ కోర్టులో శుక్రవారం హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. దాడుల్లో సిఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే ఖబడ్దార్ - డీఎస్పీ రమణమూర్తి : సంఘటన అనంతరం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ అవినీతికి ఎవరు పాల్పడిన కఠినంగా శిక్షకు గురికాక తప్పదని హెచ్చరించారు. చిన్న వ్యాపారుల నుంచి కూడా అదనంగా ఒక్కో తూకం యంత్రానికి రూ.400 వసూళ్లు చేయడం దారుణమన్నారు. దీంతో పాటుగా ఉద్దేశ పూర్వకంగా సంబంధిత కాటాలకు అనుమతులు ఇవ్వాల్సి ఉండగా గత ఏడాది అక్టోబరు నెల నుంచి పెండింగ్ లో ఉంచారన్నారు. మొత్తం 445 మంది కాటాలకు చెందిన డబ్బులు ఏక మొత్తంలో తీసుకొంటుండగా తూనికల కొలతల శాఖ అధికారి శ్రీధర్ ను పట్టుకున్నామన్నారు. ఆయన గత నేర చరిత్ర కూడా పరిశీలిస్తున్నామని, దీంతో పాటుగా ఇంకా ఏమైనా నేరాలకు పాల్పడిందో.. లేదో సూక్ష్మ పరిశీలన చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా అవినీతికి పాల్పడిన వారిపై ఫిర్యాదులు ఇస్తే వారి పేర్లు బయటకు చెప్పకుండా దాడులు చేసి అవినీతి పరుల ఆట కట్టిస్తామని స్పష్టం చేసారు.

వైసీపీ కార్యకర్తను డా.సీదిరి పరామర్శ

విశాలాంధ్ర -మందస : మండలం చీపి పంచాయతీ బొందికారి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త సవర రామదాస్ ఇటీవల రోడ్ ప్రమాదంలో గాయపడిన సమాచారం తెలుసుకొని గురువారం మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బొందికారి చేరుకుని రామదాసును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిలు అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, మండల వైసిపి అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, మాజీ ఎంపీపీలు సవర కామేశ్, బత్తిన హేమారావు సాబకోట, చీపి, టంగరపుట్టి సర్పంచ్‌లతో పాటు గిరిజన సంఘ నాయకులు జగన్ తదితరులు ఉన్నారు.

వంట, వార్పుతో నిరసన మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ నిరసన

విశాలాంధ్ర -శ్రీకాకుళం టౌన్ : 8 రోజులుగా కొనసాగుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులు వంట వార్పుతో తమ నిరసనలను తెలుపుతున్నారు. యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉదయం నుండి విధులు బహిష్కరించి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ ఇంజనీరింగ్ కార్మికుల గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, వై.శ్యామలరావు, ఆర్.సతీష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచి ఇవ్వాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, కనీస పెన్షన్ పదివేలు ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. రాష్ట్రవ్యాప్త ఉద్యమాలూ ఉధృతం చేస్తామని తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా యూనియన్ నాయకులతో చర్చలు జరిపి మా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే, సమ్మె మరింత ఉధృతం చేస్తామన్నారు. గత 3 రోజులు నుండి వంట వార్పు కార్యక్రమం కూడా చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు సొంగల శంకరరావు, ముఖేష్ యాదవ్, జై కిషోర్, మజ్జిశ్రీను, శ్రీకాకుళం సతీష్,రాఘవ, కరుణ, పెటస్రికాంత్, సుజాత, మాధురి, సుధాకర్‌రావు, మణికంఠబొట్ట, త్రినాథ, బోస్, జగదీష్, మెంటాడ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో 'కుందన' విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

విశాలాంధ్ర-నరసన్నపేట : పట్టణంలో కుందన నవోదయ, సైనిక్ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గురువారం విడుదలైన సైనిక్ స్కూల్-2025 ఫలితాల్లో కుందన కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థులు, కింజరాపు రోహిత్ (దేశవానిపేట) 271/300మార్కులు సాధించగా, యడ్ల చైతన్య(చిన్న ఈదులవలస) 269, కొరికాన వెంకట భానుచంద్ర(కంబకాయ) 261, అంధవరపు సాత్విక్ గుప్తా (హిరమండలం) 248, ధీర్ఘాశి జతిన్ (పాతూరు) 241, వాన ఈశ్వర్ బాలాజీ(వాంద్రాడ) 240, మెయ్యి మోక్షవర్ధన్(జమ్ము) 201మార్కులు కైవసం చేసుకున్నారు. ఈ సంధర్భంగా కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్, తోట వైకుంఠరావు విశాలాంధ్రతో మాట్లాడుతూ సెంటర్ నుండి సుమారు సైనిక్ స్కూల్ పరీక్షకు 20మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో పైన పేర్కొన ఏడుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించగా, మిగిలిన పది మంది విద్యార్థులు పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సైనిక్ స్కూల్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులందరికీ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్, తోట శ్రీనివాసరావు అభినందనలు తెలియచేశారు.

జిల్లాలో లక్ష మొక్కల పెంపకమే లక్ష్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాను హరిత జిల్లాగా మార్చేందుకు భారీ చర్యలు చేపట్టామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. లక్ష మొక్కలు నాటేందుకు టార్గెట్ నిర్ణయించామని ఆయన వెల్లడించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అధికారుల సమావేశంలో అయన మాట్లాడుతూ మొక్కలు పెంచేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని అటవీ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు.చెరువుల గట్లు, కాలువల పక్కన మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా చూడాలని తెలిపారు. ప్రజలు కూడా భారీగా భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.మొక్కల రక్షణ అత్యవసరం అని, ఓపెన్ ప్రదేశాలలో రక్షణ ఉండదని, క్లోజ్డ్ కాంపౌండ్, హాస్పిటల్ లాంటి ప్రదేశాల్లో నాటితే మెరుగైన ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఫెన్సింగ్ తప్పనిసరిగా సిమెంట్, కాంక్రీట్ లేదా ఇటుకలతో ఉండాలని, లేకపోతే మొక్కలు నశించిపోతాయని హెచ్చరించారు. ప్రతి విభాగం తన పేరుతో మొక్కలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయించి, స్థానికులను వాటి సంరక్షణకు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ ఉద్యమాన్ని ప్రజల భాగస్వామ్యం తో చేపట్టి జిల్లాను పచ్చదనంతో నిండేలా చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏపీఈఏపీ సెట్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ ఈఏపీ సెట్ కొనసాగుతోంది. గురువారం రెండు షిఫ్ట్స్ కలిపి శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 559కు 535 మంది, శ్రీ వెంకటేశ్వ ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 339కు 326 మంది హాజరయ్యారు. ఈ నెల 19వ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షలు 27వ తేదీ వరకు కొనసాగుతాయి.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం మాణిక్యపురం ఫీడర్ పరిధిలో 11 కేవీ మరామత్తులు, ఆర్టీఎస్ఎస్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాణిక్యపురం, కుసుంపురం, బల్లిపుట్టుగ తదితర గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగునని పలాస ఈఈ జి. విఘ్నేశ్వరరావు తెలిపారు. గృహ సర్వీసులు, వ్యవసాయ సర్వీసులు వారు సహకరించాలని కోరారు.

జిల్లాలో క్రీడాభివృద్ధికి చర్యలు

- జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కూన రవికుమార్, సూర శ్రీనివాసరావు ఎన్నిక

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమదాల వలస శాసనసభ్యులు, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలం కుశాలపురం పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రావీణ్యం సాధించిన వారికి ప్రభుత్వం అన్ని రాయితీలు కల్పిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని యువత క్రీడల్లో మంచి నైపుణ్యం సాధిస్తున్నారని, వీరికి మరింత తర్ఫీదు నిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. నూతన కార్యవర్గంలో జిల్లా అధ్యక్షునిగా ఎమ్మెల్యే కూన రవికుమార్, కార్యదర్శిగా సూర శ్రీనివాసరావు, కోశాధికారిగా జీవీ సత్యనారాయ ణ. చైర్మన్ గా కలిదిండి నర్శింహరాజు, కన్వీనర్ బడగల హరిధర్, కార్యనిర్వహక కార్యదర్శిగా ఎంవీ రమణ, ఉపాధ్యక్షులుగా ఎం.తిరుపతిరావు, బి. సురేష్, సంయుక్త కార్యదర్శులుగా ఎ. ఢిల్లీశ్వరరావు, ఎం. అరవింద్ కిరణ్‌తోపాటు మరో ఆరుగుర్ని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రెండు పశువుల వ్యాన్లు పట్టివేత

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలం నవభారత్ జంక్షన్ జాతీయ రహదారిపై గురువారం రెండు పశువుల వ్యాన్లను పోలీసులు పట్టుకున్నారు. నారాయణవలస నుంచి అలమండకు తీసుకువెళు న్న 13 దూడలతో కూడిన వ్యాన్ను, అలాగే 8 గేదెలతో కూడిన వ్యాన్ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ పశువులను కొత్తవలస గోశాలకు తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామకృష్ణపురంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-టెక్కలి : మండలంలోని వీర రామకృష్ణాపురం గ్రామంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ సంజీవ పార్వతి ఉద్దారక స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బెండి నర్సింగరావు, పార్వతి దంపతులు చేతులు మీదుగా ఉదయం నుండి ప్రత్యేక పూజలు, హెూమాలు వేద పండితులతో నిర్వహించి, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ మధ్యనే ఆలయాన్ని జీర్ణోధరణ గావించి పునః ప్రతిష్ట కార్యక్రమాలను కూడా అఖండమైనటువంటి విజయ అభివృద్ధి పథంలో జరిపించడం జరుగుతుందని, అప్పట్నుంచి ఈ శ్రీరాముని ఉత్సవాలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ఈ విగ్రహం అప్పుడు కర్ణాటక వంశస్థులు చెప్పినటువంటి విగ్రహం అని, ఆ రూపురేఖలతో సంబంధించి రామరామ యుద్ధంలో సంజీవ పర్వతాన్ని తీసుకొచ్చిన సందర్భంలో చేక్కినటువంటి విగ్రహం అని అన్నారు. ఈ సంజీవ పార్వతి ఉద్దారక స్వామి సంకటమోచన హనుమాన్ ఈ మారుమూల గ్రామంలో ఉండడం వల్ల సరైన ఆదరణ లభించగా దీనికి పట్టించుకునే నాథులు లేకపోయిన పరిస్థితుల్లో అభివృద్ధికి నోచుకోలేక పోవడం జరిగింది కానీ, స్వామివారి మహిమ వల్ల సుదుర ప్రాంతాల నుంచి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా వచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటూ ఉన్నారు. సంకటమోచనా విగ్రహాన్ని దర్శించి స్వామివారి తీర్థప్రసాదాలు గాని సేవించినట్లయితే సుదీర్ఘకాలం నుంచి ఉన్నటువంటి అకాల వ్యాధులు కూడా నెరవేరతాయని ఇక్కడ స్వామివారి వైసిష్యం అని బ్రాహ్మణులు స్పష్టంగా తెలిపారు. అనంతరం ధర్మకర్త నర్సింగరావు మాట్లాడుతూ ఈ ఆలయం మా ముత్తాతలు నిర్మించారని, సుమారు 200 నుండి 300 సంవత్సరాలు కిందట, స్వయంభుగా దొరికినటువంటి విగ్రహం అని అన్నారు. ఈ తరహా విగ్రహం మన ఆంధ్రప్రదేశ్లో ఎక్కడా లేదని, ఇవన్నీ కర్ణాటక తరహా విగ్రహాలని, ఈ విగ్రహం చాలా మహిమ కలిగినటువంటి విగ్రహం అని అన్నారు. ఆలయ నిర్మాణం మొదటి భాగం నుండి ఎన్నో ఉత్కంత కరోనా లాంటి సమస్యలు రోజులు వచ్చినప్పటికీ పూర్తి అయిన వరకు ఎలాంటి ఆకంటాలు లేకుండా పూర్తి చేసుకున్నట్లు తెలియజేశారు. ఈ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు, ప్రజలు ఎంతో సహకరించారని అందుకే ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తి జరిగిందని తెలిపారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తోపాటు గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కార్యకర్తగా పద్మ తిరిగి నియామకం

విశాలాంధ్ర-ఆమదాలవలస : నెల్లిపర్తి అంగన్వాడి కార్యకర్త శెట్టి పద్మావతిని నియ మించాలని కోర్టు ధ్రువీకరించింది. దీంతో గురువారం సిడిపిఓ అనురాధ తిరిగి నియామక ధ్రువీకరణ పత్రా న్ని పద్మాకి అందించారు. మండలంలోని నెల్లిపర్తి గ్రా మానికి చెందిన అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న శెట్టి పద్మాని 2022 నవంబర్ 17వ తేదీన అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యం గా విధులు నిర్వహిస్తున్నారని విధులు నుండి తొల గించారు. అప్పటికి పలుమార్లు స్థానిక నాయకులు ఫిర్యాదుతో అప్పటి సిడిపిఓ బాలమణి దర్యాప్తు నిర్వహించి 100 గ్రాములు బియ్యం అదనంగా ఉన్నా యని ఉన్నతాధికారులకు నివేదించారు. తిరిగి వారిని పరిశీలించాలని 2022 నవంబర్ 10వ తేదీన ఆము దాలవలస, టెక్కలి, సారవకోట సిడిపిఓ లను దర్యా ప్తు నిర్వహించాలని అప్పుడు ప్రభుత్వం ఆదేశించిం ది. దీంతో నెల్లిపర్తి అంగన్వాడి కార్యకర్త పద్మా నిర్ల క్ష్యంగా విధులను నిర్వహిస్తున్నారని ఈమెపై ఎందు కు చర్యలు తీసుకోకూడదు తెలియ జేయాలని కోరు తూ జిల్లా కమిటీకి, కలెక్టర్కు నివేదికనందించారు. 17వ తేదీ 2022 నవంబర్ న విధి నిర్వహణలో నిర్ల క్ష్యంగా ఉన్నందున ఆమెను తొలగిస్తున్నట్లు ఉత్తర్వు లు జారీ చేశారు. అంగన్వాడీ కార్యకర్త వెంటనే కోర్టు ను ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వులు ఆమె తొలగింపు చెల్లదని తిరిగి నియామకం చేపట్టాలని స్త్రీ శిశు సంక్షే మ శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గురువారం పద్మ నియామక పత్రాన్ని సిడిపిఓ అందించారు.

పోలాకిలో ప్రీ ఎక్లాంప్సియా పై అవగాహన

విశాలాంధ్ర-పోలాకి: పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ రావు ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీ ఏక్లాంప్సియా పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనాథ్ రావు మాట్లాడుతూ ఏ తల్లి ప్రసవిస్తూ మరణించకూడదు అని ఏ బిడ్డ మరణించడానికి జన్మించకూడదు అనే సంకల్పంతో ప్రీ ఎక్లాంషియాను సాధ్యమైనంత త్వరగా గుర్తించటం తల్లులను సంరక్షించడం శిశువులను సురక్షితంగా ఉంచడం అనే ప్రధాన లక్ష్యంఅని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నల్లి రవికుమార్ ఆరోగ్య విస్తరణ అధికారి మాట్లాడుతూ కవలలు లేదా అంతకంటే ఎక్కువ ముందుగా జన్మించిన తల్లులు అధిక రక్తపోటు లక్షణం ఉన్న గర్భిణీ స్త్రీలు, అదేవిధంగా కిడ్నీ వ్యాధులు మరియు షుగర్ వ్యాధిగ్రస్తులు, కుటుంబ చరిత్రలో ప్రీ యక్లాంప్షియా ఉన్నట్లు గుర్తించబడిన గర్భిణీలు, 20 ఏళ్లలోపు మరియు 35 సంవత్సరాలు దాటిన గర్భిణీలు, ఒబిసిటీ ఉన్న గర్భిణీ స్త్రీలు ఎక్కువగా ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉందని అన్నారు. గర్భవతి కాలం 20 వారాల దాటిన తర్వాత, అధిక రక్తపోటు, మరియు అవయవల క్షీణత, లక్షణాలుగా ఈ వ్యాధి బయటపడుతుందని అన్నారు. సకాలంలో గర్భిణీ తనిఖీలు, మరియు ప్రతి గర్భిణీ ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించుకోవడం ద్వారా ఈ వ్యాధిని సకాలంలో గుర్తించుకోవచ్చనీ తద్వారా ఈ వ్యాధి నుంచి బయటపడే అవకాశం కూడా ఉందని సూచించారు. అలాగే అధికంగా తలనొప్పి, అధిక రక్తపోటు, దృష్టిలో దోషం, ముఖం వాపు, కాళ్లు చేతులు వాపులు, శ్వాస పీల్చుకోవటం కష్టం, నీరుడు తగ్గటం, ఏపీ గ్యాస్ ట్రిక్ నొప్పి వంటి లక్షణాలు ఈ వ్యాధులు కనిపిస్తాయని రవికుమార్తెలిపారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గా సకాలంలో సాధారణ గర్భిణీ స్త్రీ కనీసం నాలుగు సార్లు వైద్యాధికారి వారి ద్వారా తనిఖీ నిర్వహించుకోవడం,ఎప్పటికప్పుడు రక్తపోటును గమనించుకోవటం, అవసరమైన రక్త పరీక్షలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవటం, ఏఎన్ఎం మరియు వైద్యాధికారి తో గర్భిణీ తనిఖీలు సకాలంలో నిర్వహించుకోవడం ద్వారా తల్లి ఆరోగ్యం వంతంగా ఉంటూ ఆరోగ్యవంతమైన బిడ్డను జన్మనివ్వటానికి ఇది ఒక మంచి అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మంగం శేఖర్ బాబు శ్రీమతి బరాటం లక్ష్మి పర్యవేక్షకులు స్టాఫ్ నర్సు నాగమణి, కుమారి, ఏఎన్ఎంలు కృష్ణవేణి ఉషా సోమేశ్వరి ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

విశాలాంధ్ర-కవిటి: హనుమాన్ జయంతి సందర్భంగా ప్రగడపుట్టుగ,కవిటి, కవిటి కొత్తూరు, జగతి, బెజ్జిపుట్టుగ,బోరివంక తదితర గ్రామాల్లో ఉదయం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి అనంతరం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసారు. వందలాది మంది మహిళలు పాల్గొని ఘనంగా కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కవిటి : దైవ చింతనతోనే మానసిన ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా రామయ్యపుట్టుగ, ప్రగడపుట్టుగ,కవిటి, కవిటి కొత్తూరు,జగతి,బెజ్జి వుట్టుగ, బల్లిపుట్టుగ గ్రామాల్లో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కవిటి మండలంలో పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం సుంకిడి గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ కలిసి చేపట్టిన ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. విశిష్ట పూజా కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, సర్పంచ్ శిలగాన భాస్కరరావు తదితరులు పాల్గొని స్వామి వారి సేవల్లో తరించారు. కార్యక్రమంలో బదకల మోహనరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ రామారావు

విశాలాంధ్ర-సోంపేట : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం దాదాపు ప్రతిచోటా జయంతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. గ్రామం, పట్టణం తేడా లేకుండా అన్ని చోట్ల జైశ్రీరాం నినాదాలు మిన్నంటాయి. హనుమాన్ జయంతిని అంగరంగ వైభవంగా విశేష పూజా కార్యక్రమాలతో నిర్వహించారు. ఇటువంటి కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు సోంపేటలోని విసనకర్రలపేట, సుంకిడి గ్రామంలోను పాల్గొని హనుమాన్ సేవల్లో తరించారు. ఈ సందర్భంగా సోంపేట విసనకర్రలపేట హనుమాన్ విగ్రహ ఆవిష్కరణలో కమిటీ సభ్యులు దుశ్శాలువతో సత్కరించారు. అలాగే సుంకిడి గ్రామంలోను ఎమ్మెల్సీని సత్కరించారు.

ఘనంగా ఎల్లమ్మ సంబరం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని పుటియాదల రెవెన్యూ గ్రామంలో వెలసిన ఎల్లమ్మ తల్లి సంబరం ప్రగడపుట్టుగ రామయ్యపుట్టుగ జంట గ్రామాలకు చెందిన భక్తులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎల్లమ్మ ప్రతిరూపంగా భావించే గజముద్ద,మేళతాళాలతో గ్రామం నుండి ఊరేగింపుగా తీసుకెళ్లి పంట పొలాల వెలసిన ఆలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మకు, చెవిటి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని వర్షాలు విస్తారంగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఈ ఉత్సవాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు.

మాజీ మంత్రి శివాజీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణంలో మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ జన్మదిన వేడుకలు గురువారం నిర్వహిం చారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కేక్ కట్ చేసి శివాజీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోంపేట పట్టణ శ్రీశయన సంఘ అధ్యక్షుడు రెల్ల నారాయణ, మద్దు కుమార్, చిత్రాడ శేఖర్, రెల్ల శ్రీనివాస్, బీన ఈశ్వరరావు, బాబూరావు మాస్టారు, గేదెల భీమారావు, బీన ప్రసాద్, బీన హేమారావు, పత్రి రామారావు, బెజ్జో ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర -మందస: మండలంలోని పలు గ్రామాలలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మందస, హరిపురం, జిల్లుండా, డిమిరియా, బాలిగాం, ముకుందపురం, అంబుగాం గ్రామాలతోపాటు పలు గ్రామాలలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా పలు దేవాలయాలలో స్వామి వారి సంకల్పం, విఘ్నేశ్వర పూజ, మండప ఆవాహనం, శాంతి హెూమం, ఆకు పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే పలాస కేటి రోడ్ ముత్యాలమ్మ కోనేరు సమీపంలో గల హనుమాన్ దేవాలయంలోనూ, పురుషోత్తపురం గ్రామంలో గల హనుమాన్ ఆలయంలోనూ హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర -ఆమదాలవలస: పట్టణంలో మూడు రోజులపాటు నిర్వహించే హను మాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ అయ్యప్ప దేవాలయం వద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ, విగ్నేశ్వర పూజ, అఖం డ దీపారాధన, స్వామివారి పూజా సంకల్పం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యం లో పుణ్యాహవచనం, కలసస్థాపన, సింధూర, తమ లపాకులతో అర్చనలు వేద పండితులు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నిర్వహించారు. అనంతరం ఆల యం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించే ఈ ఉత్స వాలు ఈ ఏడాది భక్తుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహకులు తమ్మినేని విద్యాసాగర్ తెలియజేశారు. ఈ అన్నదాన కార్యక్ర మంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, శిల్ల మల్లికార్జునరావు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంగరంగ వైభవంగా ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి/ కోటబొమ్మాళి: ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా సంతబొమ్మాళి కోటబొమ్మాళి మండలాల్లో వాడవాడల గురువారం అంగరంగ వైభవంగా ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు జరిగాయి. సంతబొమ్మాళి మండలం బోరుభద్ర, మలగాం, గోదలాం, చొక్కరువానిపేట, దండుగోపాలపురం, రూంకు హనుమంతపురం, టెంకపేట తో పాటు పలు గ్రామాల్లో భక్తులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని పూజలు నిర్వహించారు. కోటబొమ్మాళి మండలంలో గల చీపుర్లు పాడు, ఉడికలపాడు తో పాటు పలు గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల నిర్వాహకులు ముందుగానే భక్తులు దర్శనార్థమై తగిన ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులు గ్రామస్తులు నారాయణ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు భజనలు చేసారు.

టీడీపీలోకి పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు..?

విశాలాంధ్ర-పలాస: పలాస అసెంబ్లీ నియోజకవర్గం ముఖ్య కేంద్రమైన పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వైసిపి ముఖచిత్రం మారుతోందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. వైసిపి సీనియర్ నాయకులు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తన రాజకీయ భవిష్యత్తు కోసం అంతరంగికులతో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. వారి సలహా మేరకే టీడీపీ నాయకత్వంతో మంతనాలు జరిపేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతుంది.టీడీపీ వారు నిర్దిష్టమైన రాజకీయ హామీ ఇస్తే చైర్మన్ గిరిబాబు టిడిపి వైపు అడుగులు వేస్తారని తెలుస్తోంది. మున్సిపాలిటీ ఎన్నికలు మరో ఏడాది కాలం ఉండడంతో ఆయన టిడిపిలోకి ప్రవేశిస్తున్నట్టు చర్చ జరగడం జంట పట్టణాలలో చర్చనీయాంశమవుతుంది. వైసీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ జెండా మోసిన బల్ల గిరిబాబుకు చైర్మన్ పదవి కోటిన్నర రూపాయల గిఫ్ట్ కు దక్కిందనేది జగమెరిగిన సత్యం. వైసీపీ ప్రభుత్వంలో దక్కిన ఈ పదవి కేవలం అలంకార ప్రాయంగానే మిగిలిపోయింది. చైర్మన్ పదవికి ఒప్పందం మేరకు అనుకున్న మొత్తం గిరిబాబు చెల్లించకపోవడంతో ఈయనను చైర్మన్ పదవిలో దిష్టిబొమ్మగా ఉంచి అప్పట్లో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అనుచరులు కొంతమంది హవా సాగించి వైసీపీ కాలంలో వారే పాలన సాగించారనేది వైసిపి కౌన్సిలర్లకు విధితమే. చైర్మన్ బల్ల గిరిబాబు తన అధికారాలు వినియోగించకుండా వారు అడ్డుకొని కమిషనర్ ను, మున్సిపల్ కార్యాలయం ఉద్యోగులను అదుపులో పెట్టుకొని పాలన సాగించారనే అపవాదు ఉంది. ఓకానొక సందర్భంలో మున్సిపల్ చైర్మన్ హెూదాలో బల్ల గిరిబాబు అంగన్వాడి ఆయా పోస్ట్ కు సిఫార్సు చేస్తే ఆయన చేసిన ప్రయత్నాన్ని అడ్డుకొని మరొకరితో ఆ పోస్టు ను భర్తీ చేశారని తెలుస్తోంది. కాగా మున్సిపాలిటీ పరిధిలో జరిగిన సమావేశాలు, ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో చైర్మన్ కు ఇవ్వవలసిన మర్యాదలు కూడా లేకుండా ఈ బ్యాచ్ అడ్డుకొని అడుగడుగునా అవమానించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గత ఏడాది జరిగిన అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో వైసిపి పార్టీ చేసిన ఎన్నికల ఖర్చు డబ్బులు చైర్మన్ బల్ల గిరిబాబు దరికి చేర్చకుండా ఆ బ్యాచ్ సభ్యులు వైసీపీ కౌన్సిలర్లకు, వార్డు ఇంచార్జిలకు స్వయంగా పంపిణీ చేస్తూ గిరిబాబును పక్కన పెట్టేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. వైసీపీ పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్న బల్ల గిరిబాబును పార్టీలో కూడా ఈ బ్యాచ్ అవమానించి అడ్డుకొని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు లేనిపోని చాడీలు చెప్పి గిరిబాబుకు దూరంగా ఉంచినట్లు అప్పట్లోనే ప్రచారం జరిగింది. పార్టీ పరంగా జరిగిన సమావేశాల్లోనూ ప్రభుత్వ పరంగా జరిగే కార్యక్రమాల్లో చైర్మన్ గిరిబాబు వేదికపై కుర్చీలో కూర్చోకుండా చేసి అనేకసార్లు అవమానించిడం, అప్పట్లో చైర్మన్ దీనిపై ఆగ్రహం వ్యక్తం చేయడం కూడా జరిగింది. గిరిబాబు పార్టీ గెలుపు కోసం పని చేయకపోయినా నష్టం ఏమీ లేదని కూడా డాక్టర్ అప్పలరాజు వద్ద ఆ బ్యాచ్ అప్పట్లో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. 2024 సంవత్సరంలో మరల వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బల్ల గిరిబాబుకు చైర్మన్ పదవి నుంచి తొలగిస్తామని అవిశ్వాస తీర్మానం చేస్తామని మాజీ మంత్రి అనుచరులు అప్పట్లో ప్రచారం చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి.చైర్మన్ బల్ల గిరిబాబును వ్యతిరేకించే వారిని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అత్యంత ప్రాధాన్యత ఇస్తుండడంతో బల్ల గిరిబాబు వైసీపీ పార్టీలో ఇక ఉండకపోవడమే మేలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో పలు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా సమస్యలు పరిష్కారం చేసేందుకు పలాస టిడిపి నాయకత్వం సహకారాన్ని చైర్మన్ గిరిబాబు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు అత్యంత సన్నిహితంగా ఉన్న నాయకులు బల్ల గిరిబాబుతో మంతనాలు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతుంది.త్వరలోనే బల్ల గిరిబాబు టిడిపిలో చేరుతారన్న ప్రచారం సాగుతోంది. తనకు వేధింపులకు గురి చేసే వైసిపి పార్టీ నేతలు కన్న టిడిపి పార్టీయే శ్రేయోష్కరమన్న భావంతో బల్ల గిరిబాబు ఉన్నట్టు తెలుస్తోంది.ఇక రాబోయే రోజుల్లో చైర్మన్ బల్ల గిరిబాబు తన రాజకీయ భవిష్యత్తు కోసం ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే..!